
TGTEL/26/A2635

DD9 వార్త

వాస్తవాలు పలుకు

తెలుగు దినపత్రిక


## ప్రభాస్ స్పిరిట్‌లో ఆ స్టార్ నటి.. మరోసారి హిట్ కాంబో రిపీట్..



04


హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 23 | 03-06-2026 బుధవారం | పేజీలు: 04 | వెల: 3/-




# తెలంగాణలో పవన్ తుఫాన్

## నగరం నడి బొడ్డున పవన్ మాస్ స్పీచ్

**"తెలంగాణ నీ అయ్యా జాగీరా..?" పవన్ పేల్చిన పొలిటికల్ డైనమైట్**

**"తెలంగాణలో జనసేన ఉంటుంది"**

**"తెలంగాణలో నేనే తిరుగుతా"**

**"తిరగనివ్వం అనడానికి మీరెవరు..?" విమర్శలకు పవన్ స్ట్రాంగ్ కౌంటర్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా రాజకీయ వేడి పెరిగింది. జనసేన అధ్యక్షుడు, చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. "తెలంగాణ నీ అయ్యా జాగీరా..?" అంటూ పవన్ కళ్యాణ్ విసిరిన సవాల్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త దుమారానికి కారణమైంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద నిర్వహించిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభలో పవన్ కళ్యాణ్ ఒక్కో మాటను రాజకీయ బాణంలా పేల్చారు. ప్రతి వాక్యం ఒక హెచ్చరికలా... ప్రతి స్పందన ఒక రాజకీయ ప్రకంపనలా మారింది.

**తెలంగాణలో జనసేన ఉంటుంది...**

**ఇదే పవన్ స్పష్టమైన సంకేతం**

తెలంగాణలో జనసేన పార్టీకి స్థానం లేదని విమర్శలు వస్తున్న సమయంలో పవన్ కళ్యాణ్ ఇచ్చిన సమాధానం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వైరల్ అవుతోంది. "తెలంగాణలో జనసేన ఉంటుంది... తెలంగాణలో నేనే తిరుగుతా... ఎన్నికల్లో పోటీ చేస్తాం... తిరగనివ్వం అనడానికి తెలంగాణ ఎవరి సొత్తు కాదు" అంటూ పవన్ ఘాటుగా స్పందించారు. ఈ వ్యాఖ్యలతో పవన్ ఒక విషయం స్పష్టం చేసినట్టైంది — తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన ఉనికిని బలంగా నమోదు చేయాలని నిర్ణయించుకుంది. రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా ఎదగాలన్న సంకేతాలను పవన్ స్పష్టంగా ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**"ప్రతి సమస్యకీ ఆంధ్ర ప్రజలే కారణమా..?"**

పవన్ ప్రసంగంలో ఎక్కువగా హైలైట్ అయిన అంశం ప్రాంతీయ విద్వేషాలపై చేసిన వ్యాఖ్యలే. ఉపాధి అవకాశాలు లేకపోవడం... పరిశ్రమలు రాకపోవడం... యువతకు ఉద్యోగాలు దొరకకపోవడం వంటి ప్రతి సమస్యకీ ఆంధ్ర ప్రజలను బాధ్యులను చేయడం సరైంది కాదని పవన్ పేర్కొన్నారు. "రాజకీయ లాభాల కోసం ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించడం మంచిది కాదు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్య నేరుగా కొన్ని రాజకీయ పార్టీలపై విమర్శగా మారింది. ఈ వ్యాఖ్యల తర్వాత సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. కొందరు పవన్ ధైర్యంగా మాట్లాడారని ప్రశంసిస్తుంటే... మరికొందరు ఆయన వ్యాఖ్యలను రాజకీయ వ్యూహంగా విశ్లేషిస్తున్నారు.

**తెలంగాణపై ప్రేమ కొత్తది కాదు**

తనపై తెలంగాణ వ్యతిరేకి అనే ముద్ర వేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణపై తనకున్న ..మిగతా 2లో

---

# సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

**సంక్షేమం–అభివృద్ధి రెండూ ప్రభుత్వ లక్ష్యమే**

**రైతుల ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి**

**సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం వేగవంతమైన చర్యలు**

**మహిళల ఆర్థిక సాధికారతకు కొత్త అవకాశాలు**

**ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది**

**పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా అడుగులు**

**గ్రామీణాభివృద్ధికి భారీ ప్రణాళికలు సిద్ధం**

**ప్రజా సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ముందంజ**

**2047 లక్ష్యంగా అభివృద్ధి చెందిన తెలంగాణ నిర్మాణం**

**ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోంది**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు పోరాడిన ఉద్యమకారులు, అమరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ఆశయాలను ..మిగతా 2లో

---



# ఉద్యమకారులను పట్టించుకోరా?

**ఉద్యమకారులు, అమరవీరులను గౌరవించడం సమాజ బాధ్యత అని వ్యాఖ్య.**

**అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్.**

**ఉద్యమకారులను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని అభిప్రాయం.**

**ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటానికి పిలుపు**

**మిలియన్ మార్చ్‌ను తలపించే స్థాయిలో కార్యక్రమం నిర్వహించాలని లక్ష్యం.**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేస్తారని భావించామని కానీ ఆ అంశాన్ని ..మిగతా 2లో

---

# విద్రోహ శక్తుల నుండి తెలంగాణను కాపాడుకుందాం

**జూన్ 2వ తేదీ తెలంగాణ చరిత్రలోనే అద్భుతమైన రోజు అన్న కేటీఆర్**

**తెలంగాణ ప్రగతి, ప్రజల సంక్షేమనే లక్ష్యంగా బీఆర్ఎస్ పని చేసిందని వ్యాఖ్య**

**తెలంగాణ అస్తిత్వానికి రక్షణ కవచంలా నిలబడిందన్న కేటీఆర్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దశాబ్దాల తరబడి సాగిన వివక్ష, అవమానాలు, అణచివేతకు ముగింపు ..మిగతా 2లో



---

# పవన్ కళ్యాణ్ చదువుతోంది మోడీ రాసిచ్చిన స్క్రిప్ట్

**పవన్ వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం**

**'మోడీ రాసిచ్చిన స్క్రిప్ట్‌నే చదువుతున్నారు' అంటూ విమర్శలు**

**తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే సహించబోమని హెచ్చరిక**

**జనసేన రాజకీయాలపై బీఆర్ఎస్ నేత ఘాటు వ్యాఖ్యలు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, ఇక్కడి ప్రజల అస్తిత్వాన్ని అవహేళన చేసేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి హెచ్చరించారు. నల్గొండ జిల్లాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పవన్ కళ్యాణ్ స్వంతంగా ఏమీ మాట్లాడటం లేదని, ప్రధాని నరేంద్ర మోడీ రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ఇక్కడ చదువుతున్నారని, ఆయనను చూస్తుంటే మోడీ ఏజెంట్‌లా అనిపిస్తోందని జగదీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు.

సినిమాల్లో చెప్పే డైలాగులను రాజకీయాల్లో మాట్లాడటం పవన్ కళ్యాణ్‌కు అలవాటుగా ..మిగతా 2లో



---

# మీకు చేత కాకుంటే చెప్పండి

**కాళేశ్వరం అంశంపై సీఎం వైఖరిని బండి సంజయ్ ప్రశ్నించారు.**

**మహారాష్ట్రతో వివాదాల కంటే సహకారం అవసరమన్నారు.**

**కేంద్ర నిధులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.**

**బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.**

**మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, అభివృద్ధిపై దృష్టి పెడతామని చెప్పారు.**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాళేశ్వరం విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించిందనే విషయం సీఎం రేవంత్‌రెడ్డి మరిచిపోయినట్లు ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌మండిపడ్డారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్‌ఇవ్వడం లేదని ఉప్పెన సృష్టిస్తామని పేర్కొనడం తెలంగాణ సమస్యలు పక్కదారి ..మిగతా 2లో

# విద్రోహ శక్తుల నుండి తెలంగాణను కాపాడుకుందాం

**మొదటిపేజీ తరువాయి**

పలికిన జూన్ 2వ తేదీ తెలంగాణ చరిత్రలోనే అత్యంత అద్భుతమైన రోజని ఆయన అభివర్ణించారు. అమరవీరుల త్యాగాలు, ఉమ్మడి ఆత్మగౌరవ పోరాటం వల్లే తెలంగాణ ప్రజలు విముక్తి సాధించారని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఉద్యమ కాలంలో వినిపించిన "తెలంగాణ వచ్చుడా... కేసీఆర్ సచ్చుడా" అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ.. 60 ఏళ్ల సుదీర్ఘ కలని నిజం చేయడంలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర రావు పోషించిన కీలక పాత్రను కేటీఆర్ కొనియాడారు. 14 ఏళ్ల పాటు సాగిన సుదీర్ఘ స్వరాష్ట్ర ఉద్యమంలో కానీ, ఆ తర్వాత తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కానీ, కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రగతి, ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా పనిచేసిందని స్పష్టం చేశారు. నేటికీ తమ పార్టీ ప్రజల గొంతుకగా నిలుస్తూ... తెలంగాణ అస్తిత్వానికి, ప్రగతికి ఒక రక్షణ కవచంలా నిలబడిందని పేర్కొన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతున్న తరుణంలో ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు ఒక ప్రత్యక్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల సేవ కోసం ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త పునరంకితం కావాలని కోరారు. తెలంగాణను దెబ్బతీయాలని చూస్తున్న విద్రోహ, వ్యతిరేక శక్తుల నుండి మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఈ ఆవిర్భావ దినోత్సవం సాక్షిగా మనమంతా మళ్లీ ఒకసారి ప్రతిజ్ఞ చేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఈ సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు.

# సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

నెరవేర్చే దిశగా తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలబెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.

**సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం**

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు రెండూ సమానంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు ఉపయోగపడే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉంటాయని, ప్రతి వర్గానికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**రైతుల ఆర్థిక స్థితి బలోపేతానికి చర్యలు**

వ్యవసాయ రంగాన్ని మరింత బలపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని సీఎం పేర్కొన్నారు. రైతులపై ఉన్న ఆర్థిక భారం తగ్గించే చర్యలు చేపట్టామని చెప్పారు. పంట పెట్టుబడులు, మార్కెటింగ్ సదుపాయాలు, సాగునీటి వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి సకాలంలో చెల్లింపులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చేందుకు కొత్త విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

**సాగునీటి ప్రాజెక్టుల పూర్తి దిశగా అడుగులు**

రాష్ట్రంలో సాగునీటి సామర్థ్యాన్ని పెంచేందుకు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి మరిన్ని ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. కొన్ని ప్రధాన ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి పనులు వేగవంతం చేస్తున్నామని వివరించారు. రైతులకు నిరంతర సాగునీరు అందేలా దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం**

మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని సీఎం అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. చిన్న వ్యాపారాలు, పరిశ్రమలు ప్రారంభించేందుకు అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు. మహిళల రవాణా ఖర్చులు తగ్గించే చర్యలు కూడా అమలు చేస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో మహిళలు పారిశ్రామిక రంగంలో మరింత ముందుకు రావాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు.

**ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతుంది**

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటని ముఖ్యమంత్రి తెలిపారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి పారదర్శకంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే వేలాది ఉద్యోగాలను భర్తీ చేశామని, త్వరలో మరిన్ని శాఖల్లో నియామక ప్రక్రియలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఇంజినీరింగ్, అటవీ, విద్య, పట్టణాభివృద్ధి తదితర శాఖల్లో కొత్త ఉద్యోగ ప్రకటనలు విడుదల చేసే అవకాశముందని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

**పేదలకు గృహాలు, సంక్షేమ పథకాల విస్తరణ**

ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టిందని సీఎం తెలిపారు. ఇప్పటికే వేలాది ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మరిన్ని ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. పేదల జీవన స్థితిగతులు మెరుగుపడేందుకు గృహాలతో పాటు విద్యుత్, రేషన్, ఇతర సంక్షేమ పథకాలను కూడా విస్తరిస్తున్నామని వివరించారు. కొత్త రేషన్ కార్డుల జారీతో అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరుతున్నాయని తెలిపారు.

**2047 నాటికి అభివృద్ధి చెందిన తెలంగాణ లక్ష్యం**

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యమన్నారు. తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రజల సహకారంతో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

# పవన్ కళ్యాణ్ చదువుతోంది మోడీ రాసిచ్చిన స్క్రిప్ట్

**మొదటిపేజీ తరువాయి**

మారిందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. తనను ఎవరో అడ్డుకున్నారని గాల్లో మాటలు చెప్పడం సరికాదని, అసలు ఆయనను ఎవరు, ఎక్కడ అడ్డుకున్నారో స్పష్టంగా చెప్పాలని నిలదీశారు. పవన్ కళ్యాణ్ అయినా, ఆయన కుటుంబమైనా తెలంగాణ ప్రజల ఆదరణ, భిక్ష వల్లే ఈ రోజు సినిమా రంగంలో ఇంతలా బాగుపడ్డారనే నిజాన్ని మరిచిపోకూడదని గుర్తుచేశారు. అలాంటిది ఇప్పుడు ఇక్కడికి వచ్చి తెలంగాణ సమాజాన్ని తక్కువ చేసి మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

ప్రస్తుతం తెలంగాణ ఎదుర్కొంటున్న అసలైన సమస్యలను, ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే పవన్ కళ్యాణ్‌తో ఈ విధమైన రాజకీయ డ్రామాలు ఆడిస్తున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. గతంలో తెలంగాణలో జనసేన పార్టీ తరపున పోటీ చేసినప్పుడు పవన్ కళ్యాణ్‌కు ఎన్ని ఓట్లు వచ్చాయో, ఇక్కడి ప్రజలు ఆయనను ఎంతవరకు ఆదరించారో ఒకసారి వెనక్కి తిరిగి చూసుకోవాలని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు రాజకీయంగా ఎంతో చైతన్యవంతులని, పవన్ కళ్యాణ్ చెప్పే కట్టుకథలను గానీ, ఆయన మాటలను గానీ నమ్మే పరిస్థితిలో ఇక్కడి సమాజం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల గురించి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని, జాగ్రత్తగా మాట్లాడాలని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు.




# తెలంగాణలో పవన్ తుఫాన్

**మొదటిపేజీ తరువాయి**







ప్రేమ రాష్ట్ర విభజన తర్వాత పుట్టినది కాదని... ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ముందే తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి తనను ప్రభావితం చేసిందన్నారు. తాను వ్యతిరేకించింది తెలంగాణ ఏర్పాటును కాదని... రాష్ట్ర విభజన జరిగిన విధానాన్ని మాత్రమే వ్యతిరేకించానని స్పష్టం చేశారు. "పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్రాన్ని విభజించడం ప్రజాస్వామ్యానికి సరైన పద్ధతి కాదు" అని పవన్ గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలతో తెలంగాణ భావోద్వేగాలను గౌరవిస్తూనే... తన పాత రాజకీయ వైఖరిని సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

**"ఆంధ్రాలోనే సీఎం అవ్వలేదు..."**

తెలంగాణలో జనసేన ఎందుకు రాజకీయాలు చేస్తోందనే ప్రశ్నకు పవన్ ఇచ్చిన సమాధానం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "ఆంధ్రాలోనే ముఖ్యమంత్రి అవ్వలేదు... ఇక్కడికి వచ్చి నేనేం చేస్తాను..?" అంటూ ఆయన చేసిన వ్యాఖ్య సభలో నవ్వులు పూయించింది. అయితే అదే సమయంలో ఆ వ్యాఖ్యలో రాజకీయ వ్యూహం కూడా కనిపించిందని విశ్లేషకులు చెబుతున్నారు. అధికార ఆశ కోసం కాకుండా... రాజకీయ అస్తిత్వం కోసం తెలంగాణలో పనిచేస్తున్నామనే సంకేతాన్ని పవన్ ఇవ్వాలని చూశారని అంటున్నారు.

**"నన్ను ఎవరు ఆపుతారు..?"**

పవన్ ప్రసంగంలో అత్యంత వైరల్ అయిన లైన్ ఇదే. "నేను తెలంగాణలో తిరుగుతా... నన్నెవరు ఆపుతారు..?" అంటూ ఆయన చేసిన వ్యాఖ్య జనసేన శ్రేణుల్లో భారీ జోష్ నింపింది. తెలంగాణలో తన పర్యటనలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న భావనతో పవన్ మరింత ఆగ్రహంగా మాట్లాడినట్లు కనిపించింది. ఈ వ్యాఖ్యల తర్వాత సోషల్ మీడియాలో #TelanganaIsNotJagir అనే హ్యాష్‌ట్యాగ్ కూడా ట్రెండ్ అవుతోంది.

**"బెదిరిస్తే బెదిరిపోవాలా..?"**

పవన్ ప్రసంగం చివర్లో భావోద్వేగానికి గురైనట్లు కనిపించారు. "నిజం కోసం నిలబడితే అడ్డుకోవాలని చూస్తారు... ప్రశ్నిస్తే బెదిరించాలని చూస్తారు... బెదిరిస్తే బెదిరిపోవాలా..? వంగితే పవన్ కళ్యాణ్ ఎందుకు అవుతాడు..?" అంటూ ఆయన చేసిన వ్యాఖ్య సభలో భారీ చప్పట్లను తెచ్చుకుంది. ఈ వ్యాఖ్యలతో పవన్ తన రాజకీయ పోరాటాన్ని వ్యక్తిగత అస్తిత్వ పోరాటంగా చూపించే ప్రయత్నం చేశారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**వారాహి యాత్ర జ్ఞాపకాలు**

ఏపీలో వారాహి యాత్ర సమయంలో తెలంగాణ ప్రజలు తనకు అండగా నిలిచారని పవన్ గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా కోదాడ, నల్గొండ ప్రాంత ప్రజల ప్రేమను ఎప్పటికీ మరువలేనన్నారు. "తెలంగాణ ప్రజలు నాకు ఎప్పుడూ ఆప్యాయతనే ఇచ్చారు" అంటూ ఆయన పేర్కొన్నారు.

**చెరువు ఆక్రమణలపై పవన్ సవాల్**

తనపై వస్తున్న చెరువు ఆక్రమణ ఆరోపణలపై కూడా పవన్ ఘాటుగా స్పందించారు. "నేను ఎక్కడైనా అక్రమంగా భూమి లేదా చెరువును ఆక్రమించినట్లు నిరూపిస్తే... ఆ ఆస్తిని వెంటనే ప్రభుత్వానికి అప్పగిస్తాను" అంటూ సవాల్ విసిరారు. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణకు సిద్ధమని స్పష్టం చేశారు.

**సోషల్ మీడియాలో పవన్ స్పీచ్ వైరల్**

పవన్ ప్రసంగం ముగిసిన కొద్ది సేపటికే సోషల్ మీడియా మొత్తం ఆయన వ్యాఖ్యలతో మార్మోగిపోయింది. యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్ వంటి వేదికల్లో పవన్ వీడియోలు భారీగా వైరల్ అయ్యాయి. జనసేన శ్రేణులు ఈ ప్రసంగాన్ని "పవన్ పొలిటికల్ రీఎంట్రీ ఇన్ తెలంగాణ"గా ప్రచారం చేస్తున్నాయి.

**తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలా..?**

పవన్ కళ్యాణ్ తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసాయి. జనసేన తెలంగాణలో నిజంగా బలపడుతుందా..? పవన్ పర్యటనలు రాజకీయ సమీకరణాలను మార్చుతాయా..? లేక ఈ వ్యాఖ్యలు కేవలం రాజకీయ వేడి పెంచేందుకేనా..? అన్న చర్చ మొదలైంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది — పవన్ కళ్యాణ్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తన ఉనికిని బలంగా వినిపించాలని నిర్ణయించుకున్నారు. "బద్దలైన అస్తిత్వ



అగ్నిపర్వతం"లా పేలిన ఈ ప్రసంగం రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించే అవకాశం కనిపిస్తోంది.

# ఉద్యమకారులను పట్టించుకోరా?

**మొదటిపేజీ తరువాయి**

ఆయన మాట్లాడకపోవగా కేకే కమిటీ విధివిధానాలను కూడా చెప్పకపోవటం దుర్మార్గం, శోచనీయం అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత (Kalvakuntla Kavitha) విమర్శించారు. ఈ అంశంపై ప్రభుత్వం ఇవాళ స్పష్టమైన ప్రకటన చేయకపోతే పెద్ద ఎత్తున భూ పోరాటం చేస్తామని నిన్న చెప్పినట్లుగానే వచ్చే జులై 2న ఉప్పల్ భగాయత్‌లో అతి పెద్ద భూపోరాటం చేయబోతున్నామని ఇవాళ ప్రకటించారు. మరో మిలియన్ మార్చ్ ను తలపించేలా ఈ ఉద్యమాన్ని చేద్దామని, ఈ కార్యక్రమానికి పార్టీలతో సంబంధం లేకుండా అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఇవాళ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో కవిత పాల్గొని జాతీయ జెండా ఆష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు, పత్రిక మిత్రులు సహా ఊరికి ఒక్కరైనా సద్ది కట్టుకోనిని ఆ పోరాటానికి రావాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను, అమరవీరులను ఆదుకోని గౌరవించుకోవాల్సిన బాధ్యత మన మీద ఉందని మేము అధికారంలోకి వచ్చాక అమరవీరుల కుటుంబాలకు రూ.కోటి ఇస్తామని, ఉద్యమకారులను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామన్నారు.

**ఆగస్టు 6 లోగా ఏర్పాటు చేయాలి:**

ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమానికి ఒక దిక్సూచిగా నిలిచారని ఈ సందర్భంగా కవిత గుర్తు చేశారు. తెలంగాణ సాధించుకున్న 12 ఏళ్ల తర్వాత కూడా మనం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోకపోవడం అన్యాయం అని తెలంగాణ జాగృతి తరపున నాలుగు జిల్లాల్లో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసి గౌరవించుకున్నామన్నారు. కానీ హైదరాబాద్‌లోనూ ఆయన విగ్రహం ఉండాల్సిన అవసరముందన్నారు. అందుకే ఆయన విగ్రహం పెట్టాలని నిన్న ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. జయశంకర్ సార్ విగ్రహం కోసం 2017లో అప్పటి మున్సిపల్ శాఖకు కూడా లేఖ రాశామని కానీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆగస్టు 6న జయశంకర్ సార్ జయంతి ఉందని ఆ లోపు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ శాఖకు మేము ఇచ్చిన లేఖను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

**మాకు అవకాశం ఇవ్వండి లేదా మీరైనా చేయండి:**

మాకు అవకాశం ఇస్తే జయశంకర్ సార్ విగ్రహ (Professor Jayashankar Statue) ఏర్పాటు ఖర్చుతో పాటు లైఫ్ టైమ్ మెయింటెనెన్స్ మేమే చూసుకుంటామని కవిత చెప్పారు. లేదంటే ప్రభుత్వమే అంతకన్నా గొప్పగా చేస్తామంటే కూడా చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమం అనేది మరో స్వాతంత్ర్య పోరాటం మాదిరిగా జరిగిందని, ఇప్పుడున్న పిల్లలకు ఈ ఉద్యమం గురించి పూర్తిగా తెలియదన్నారు. వారంతా మన చరిత్రను తెలుసుకోవాలని, ఎంతో మంది ప్రాణత్యాగాలు, ఉద్యమాలు చేసి ఈ రాష్ట్రాన్ని సాధించారన్నారు. జూన్ 2 అంటే ఒక హాలిడే కాదని మీకు వివక్ష లేకుండా, మీ యాసను మీరు మాట్లాడుకునేలా చేసిన రోజు అని గుర్తు చేశారు. మీరు సెకండ్ గ్రేడ్ పౌరులు కాదని, ఎంతో స్వేచ్ఛగా ఉండే అవకాశం వచ్చిన రోజు అని అందుకే మన చరిత్రను కచ్చితంగా ఇప్పటి పిల్లలంతా కూడా తెలుసుకోవాలన్నారు. ఆగస్టు 15 న ఎంతో గొప్పగా వేడుకలు జరుపుకుంటామో.. జూన్ 2ను కూడా అంతే గొప్పగా సెలబ్రేట్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# మీకు చేత కాకుంటే చెప్పండి

**మొదటిపేజీ తరువాయి**

పట్టించి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నమని ఆరోపించారు. ముఖ్యమంత్రికి అపాయిట్ మెంట్ తీసుకోవడం చేతగానే విషయం ఒప్పుకుంటే తాను, కిషన్ రెడ్డి ముందుకొచ్చి అపాయిట్ మెంట్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. పక్క రాష్ట్రాలతో మంచి సంబంధాలు పెట్టుకుంటూ ముందుకుపోవాలే తప్ప కయ్యాలు పెట్టుకుంటూ రాజకీయ లబ్ది పొందాలనుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ కుక్కలు చింపిన విస్తరిలా మారిందన్నారు. తెలంగాణ బాగుపడాలంటే కేంద్ర నిధులు అవసరమన్నారు. రాష్ట్రంలో ఈసారి బీజేపీకి అధికారమిస్తే పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. రాష్ట్రంలో ట్రిపుల్ సీ సినిమా కన్పిస్తోందని, కాంగ్రెస్ అంటేనే కరప్షన్, కలెక్షన్, కమీషన్ అని ఎద్దేవా చేశారు.

మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద నిర్వహించిన ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా హజరై ప్రసంగిస్తూ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామే తప్ప తెలంగాణ ఆశయాలు, లక్ష్యాలను మాత్రం చేరుకోలేకపోయామని ఉమ్మడి రాష్ట్రంలో, ఇప్పుడు ఆర్థిక పరిస్థితి ఏ విధంగా దిగజారిందో కళ్ల ముందు కన్పిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలన ప్రజలు పెనం మీద ఉంటే కాంగ్రెస్ పాలనలో పొయ్యిలో పడట్లు ఉందని, కుక్కల చింపిన విస్తరిలా తెలంగాణ మారిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం టంబం బాగుపడింది. లక్షల కోట్ల రూపాయలు సాధించుకున్నారు. 1400 మందిని బలిని తీసుకుంటే తప్ప కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వలేదు. తెలంగాణ ఇస్తారా, తాము బిల్లు పెట్టి ఇవ్వాలా అని సుష్మా స్వరాజ్ నిలదీస్తే తప్ప కాంగ్రెస్ తెలంగాణను ఏర్పాటు చేయలేదన్నారు. తెలంగాణ ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించింది బీజేపీయే. తెలంగాణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన సమయంలో కేసీఆర్ కనీసం సభకు కూడా రాలేదు. తెలంగాణపై జరిగిన చర్చలో కూడా పాల్గొనలేదు. రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం దోచుకుందని విమర్శించారు.

కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే దోచుకుంటుంది బీఆర్ఎస్ ను ఓడించి కాంగ్రెస్ కు అధికారం అప్పగిస్తే దారుణ పాలన చేస్తోంది. ఈ జనరేషన్ ట్రిపుల్ ఆర్ సినిమా మాత్రమే చూసిందే. కానీ ఓటేసిన పాపానికి ట్రిపుల్ సీ సినిమా చూపిస్తోంది. కన్ఫ్యూజన్ ,కరప్షన్, కమీషన కాంగ్రెస్ దటీస్ ట్రిపుల్ సీ. 6 గ్యారంటీల అమలులో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ ను చూసి జనం అసహ్యించుకుంటున్నారు. కేంద్రం ఇస్తున్న నిధులను కూడా వాడుకోలేని దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానిది. అడ్డగోలుగా అవినీతికి పాల్పడుతూ కేంద్ర నిధులను దుర్వినియోగం చేస్తోంది. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదు. కేంద్రానికి పంపిన నివేదికల ఆధారంగా కేంద్రం వడ్లను కొంటోంది. అయినా కేంద్రం వడ్లు కొనడం లేదని ఆరోపించడం దుర్మార్గమన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించుకుండా చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత మోడీ ప్రభుత్వానిదేనని, తెలంగాణ అభివృద్ధి చెందాలంటే కేంద్ర నిధులు అవసరం. ఇది జరగాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్యగౌడ్, సీనియర్ నేతలు పొంగులేటి సుధాకర్ రెడ్డి, గౌతంరావు, అశోక్, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, రాములు తదితరులు హాజరయ్యారు.





# నిజామాబాద్ పోలీసులకు 'సేవా పతకాల' పురస్కారం

**నిజామాబాద్ జిల్లా, జూన్ 02(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా, పోలీస్ శాఖలో అత్యుత్తమ సేవలు అందించిన 19 మంది అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా సేవా పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య హాజరై విజేతలను అభినందించారు. మహోన్నత సేవా పతకాన్ని ఎస్.సంతోష్ రెడ్డి అందుకోగా, టి.నాగభూషణం, షేక్ గఫార్, బి.జగదీశ్వర్‌లకు ఉత్తమ సేవా పతకాలను ప్రదానం చేశారు. వీటితో పాటు బి.శ్రీనివాస్, బి.శివరాం, ఏ.ఆనంద్ సాగర్, ఖాన్ హబీబ్, పి.రాజేశ్వర్, పి.సంజీవరావు, జి.ఉదయ్ కుమార్, ఎం.విట్టల్ రావు, ఎస్.రాజేందర్, మహమ్మద్ అబ్దుల్ రహీం, పి.రాజేశ్వర్, పి.మోహన్, బిస్మిల్లా బేగ్, సి.హెచ్.సుభాష్, కె.రామారావులకు సేవా పతకాలను అందజేసి సత్కరించారు.



# అర్హులైన ప్రతి పేదవారికి ఇల్లు: ఎమ్మెల్యే

- **మీ ఇంటికి వచ్చి ఇల్లు ఇస్తా - మీరు ఎక్కడికి తిరగొద్దు ఎమ్మెల్యే**

**నేరడిగొండ జూన్ 2 (డిడి 9వార్త)**

మండలంలోని వాంకిడి గ్రామానికి చెందిన ఆడిగేం లక్ష్మీ ప్రభాకర్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ పేదవారికి ఇల్లు అందజేసేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎంపిడిఓ, హౌసింగ్ అధికారులు, మాజీ ఎంపీపీ రాథోడ్



సజన్, స్థానిక సర్పంచ్ జ్యోతి, సీనియర్ నాయకులు అనిల్ యాదవ్, మాజీ సర్పంచ్ రాజు, నజీర్, రవీందర్ రెడ్డి, భారత్, శ్రీను, అశోక్ తదితరులు ఉన్నారు.

# అంగరంగ వైభవంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అదిలాబాద్ జిల్లా నేరడిగొండ జూన్ 2 (డిడి 9వార్త)**


తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఊరువార పండుగ వాతావరణం నెలకొంది మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో జాతీయ జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు, మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం,ఎంపీడీవో కార్యాలయం, ఐకెపి కార్యాలయం, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ పాఠశాలలు, పశు వైద్యశాల, పిఎసిఎస్ నేరడిగొండ, పిఎసి ఎస్ కుమారి, అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామాల సర్పంచ్ లు జాతీయ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ తెలంగాణ గొప్పతనాన్ని చాటిచెప్పారు.



# వ్యవసాయ అధికారిని ఏ ఈ ఓ సుప్రియ బదిలీ అదే స్థానంలో అరుణ్ నియామకం

**నిజామాబాద్ పోతంగల్ జూన్ 02 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల వ్యవసాయ అధికారిని కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించి అనేకమంది రైతుల హృదయాలలో మంచి పేరు సంపాదించి అనేక రకాల సలహాలు సూచనలు అందిస్తూ అటు ప్రభుత్వానికి ఇటు రైతులకు మంచి మంచి సలహాలు సూచనలు చెబుతూ రైతులతో ప్రేమానురాగాలతో వ్యవసాయానికి సంబంధించి అవగాహన చెబుతూ రైతుల పట్ల మంచి అనుభవాన్ని పంచి గొప్ప అధికారినిగా పేరు సంపాదించి ఈరోజు పోతంగల్ మండలం నుండి బదిలీ అయిపోవడం మాకెంతో బాధాకరంగా ఉంది అని రైతులు వాపోయారు ఈ సందర్భంగా సుప్రియ పలు గ్రామస్తులు శాలువాతో సత్కరించారు అదే స్థానంలో నూతనంగా పోతంగల్ మండల వ్యవసాయ అధికారిగా అరుణ్ బాధ్యతలు స్వీకరించారు ఆయనకు కూడా శాలువతో సన్మానించారు ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల ఏవో నిషిత హెగ్డోలీ ఏ ఓ శంకర్ హంగర్గా సర్పంచ్ ఉదయ్ భాస్కర్ ఉప సర్పంచ్ దుర్కి గోపాల్ గ్రామస్తులు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు



# బషీరాబాద్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 02(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జమున మహేష్, ఉప సర్పంచ్ చిలివేరి భుమేశ్వర్, కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు రమేష్, రాజు, శేఖర్, లావణ్య, శ్రీనివాస్, రాకేష్, లక్ష్మీ, రవిలతో పాటు పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆరో తరగతి ఎంపిక జాబితా ప్రదర్శన

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ జూన్ 2 (డి డి 9 వార్త ):-**

బోథ్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశం పొందిన ఆరో తరగతి విద్యార్థుల జాబితా ప్రదర్శించినట్లు ప్రిన్సిపల్ డా॥ అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 7 లోపు ఒరిజినల్ టీసి, బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రము, ఆధార్ మరియు రెండు పాస్ ఫోటోలతో) పాఠశాలలో సంప్రదించాలని కోరారు.




# హంగర్గ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా

**నిజామాబాద్ పోతంగల్/జూన్ 02 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో మంగళవారం రోజున తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ తల్లి పోటో కు పూల మాల వేసి గ్రామ సర్పంచ్ నీరడి ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ నిర్వహించుకున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉదయ్ భాస్కర్, ఉప సర్పంచ్ దుర్కి గోపాల్, పంచాయతీ సెక్రటరీ గంగారం, మాజీ ఏ ఎంసి చైర్మన్ నీరడి గంగాధర్, ఆశ వర్కర్స్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు




# పోతంగల్ మండల కేంద్రంలో పాలుచోట్ల తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా

**నిజామాబాద్ పోతంగల్/జూన్ 02(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల పరిధిలో ఎంపీడీవో ఆఫీస్ గ్రామపంచాయతీ కార్యాలయం , మండల రెవిన్యూ ఆఫీస్, హైస్కూల్, రైతు వేదిక, పార్టీ కార్యాలయంలో పోతంగల్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం నందు ఎమ్మార్వో సందీప్, ఎంపీడీవో ఆఫీస్ , చందర్ నాయక్, గ్రామపంచాయతీ సర్పంచ్ సంధ్య, వీరి చేతుల మీదగాతెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా* ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి పూలమాలవేసి జెండా ఆవిష్కరణ నిర్వహించారు ఈ కార్యక్రమంలో, కోటగిరి పోలీస్ సిబ్బంది, పోత్తంగల్ సెక్రెటరీ , ప్రతాప్ ,మండల అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ , పుప్పల శంకర్, బజరంగ్ ,ఉప సర్పంచ్, గులాం నబి, వార్డ్ నెంబర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు మాజీ ఎంపీపీ గంధపు పవన్ మాజీ ఎంపీ టీ సీ కేశవ్ వీరేశం , సూదం ధనరాజ్ , మున్నూర్, రమేష్ సెట్, దిలీప్, మాజీ సర్పంచులు శంకర్, విట్టల్, సందాని , జుమ్మా కాన్, హనుమంతు, వీరయ్య , కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



# బోధన్‌లో అమరవీరులకు ఘన నివాళి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 02(డీడీ9 వార్త) :**

తెలంగాణ అమరవీరుల ఆకాంక్షలను సాకారం చేయడమే వారికి అందించే నిజమైన నివాళి అని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్ ఉద్ఘాటించారు. మంగళవారం బోధన్ అంబేద్కర్ చౌరస్తాలోని అమరవీరుల స్తూపం వద్ద పార్టీ ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులకు దక్కని గుర్తింపు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ కరువైందని విమర్శించారు. హామీ ఇచ్చిన ఇంటి స్థలాలు, పింఛన్ల అమలులో తాత్సారం జరుగుతోందని ఆరోపించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణ, ఉచిత విద్య, వైద్యం కోసం నిరంతరం పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పడాల శంకర్, సిహెచ్. రమేష్, టి.దేవయ్య, బి.సాయిలు, డి.పోశెట్టి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 02(డీడీ9 వార్త) :**


తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కమిషనరేట్ కార్యాలయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య జాతీయ జెండాను ఎగురవేశారు. డీఐజీ జోన్ 2 క్యాంపు కార్యాలయంలో డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్ జాతీయ జెండాను ఆవిష్కరించగా, ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డీసీపీ (ఏఆర్) కె. 1రామచంద్రరావు జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అమరవీరులకు నివాళులర్పించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ జిల్లా, జూన్ 02(డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఘన నివాళులర్పించారు. మంగళవారం స్థానిక అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్న ఆయన, పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# ఉమ్మడి మండలాల్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నిజామాబాద్ కోటగిరి పోతంగల్ /జున్ 02/(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి కోటగిరి పోలీస్ స్టేషన్ నందు తాసిల్దార్ కార్యాలయం నందు ఎంపీడీవో కార్యాలయంలో సహకార సంఘంలో అంగన్వాడి కేంద్రాలలో హైస్కూల్లో మార్కెట్ కమిటీ కార్యాలయంలో అదే విధంగా పోతంగల్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఎంపి డివో కార్యాలయం హైస్కూల్లో అంగన్వాడి కేంద్రాలలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు మువ్వన్నల జెండాలను ఎగురవేసి పథకానికి వందనం సమర్పించి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు పోతంగల్ గ్రామపంచాయతీ 24 మంది సిబ్బందికి బట్టలను పంపిణీ చేశారు. కోటగిరి బస్టాండ్ ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండా ఎగరవేసి తదనంతరం బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేసి జాతీయ గీతం, తెలంగాణ గీతాన్ని ఆలపించారు టపాసులతో లక్ష్మి టపాసులతో బస్టాండ్ ఆవరణ ఓరెత్తింది. బిఆర్ఎస్ నాయకుడు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ సాధించటానికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని తన ప్రాణానికి సైతం లెక్కచేయకుండా నిరాహార దీక్ష పూనుకొని తెలంగాణను సాధించిన మహా నాయకుడు కెసిఆర్ అన్నారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి బీదవారికి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ కేసిఆర్ కిట్టు రైతుబంధు రైతు బీమా వికలాంగుల పెన్షన్ వీడో పెన్షన్ ఒంటరి మహిళ పెన్షన్ బీడీ కార్మికుల పెన్షన్ దళిత బంధు, యంత్ర లక్ష్మి పథకాలను ప్రవేశపెట్టిన మహానీయుడి కెసిఆర్ బాన్సువాడ నియోజకవర్గం లో 12 వేల డబుల్ బెడ్రూంలో మంజూరు చేసిన ఘనత కేసిఆర్కే దక్కిందని అన్నారు బాన్సువాడ నియోజకవర్గాన్ని కొన్ని వేల కోట్లతో అభివృద్ధి చేశారని అన్నారు ఈ కార్యక్రమంలో కోటగిరి మండల తాసిల్దార్ ఎంపీడీవో విష్ణు గ్రామపంచాయతీ సెక్రెటరీ సందీప్ గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్ విండో చైర్మన్ కూచి సిద్దు ఏఎంసీ ఉపాధ్యక్షులు అనిల్ కుల కర్ని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు అబ్దుల్ అమిద్ తేళ్ల రవికుమార్, కిషన్ కొల్లూరు కిషోర్ నజీర్ వహీద్ కన్నం దావుల య్య మారుతి తదితరులు పాల్గొన్నారు







తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తోన్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే ఇలాంటి వార్తలపై స్పందించని త్రిష (Trisha) పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేసిన ఆమె.. దానికి ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. 'నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను' అని రాసుకొచ్చారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ.. తనపై రూమర్స్ క్రియేట్ చేస్తోన్న వారిని ఉద్దేశించే ఆమె ఈ పోస్ట్ పెట్టారని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

ఇక మే నెల ప్రారంభంలో పెట్టినట్లు నెలాఖరులోనూ త్రిష పోస్ట్ పెట్టారు. ఈ నెల మొదట్లో.. 'నాకు ఇష్టమైన మంత్ వచ్చేసింది' అని పెట్టిన ఆమె..

తాజాగా 'ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా నా ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుంది' అని కొన్ని ఫొటోలు షేర్ చేశారు. దీనికి 'మ్యాజికల్ మే..' అని క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఈ నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే రోజు తన స్నేహితుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సొంతం చేసుకోవడంతో ఆమె పేరు సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయింది. దానితో పాటు ఆమె నటించిన 'కరుప్ప' హిట్‌గా నిలిచి రూ.348 కోట్లకు పైగా వసూళ్లు చేసింది.

## వ్యక్తిగత విషయాలపై రూమర్స్.. పరోక్షంగా స్పందించిన త్రిష

## టాలీవుడ్ ఇండస్ట్రీపై జాన్వీ ప్రశంసలు..

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ 'పెద్ది' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో విడుదల కాబోతున్న (జూన్4) ఈ సినిమాలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు సనా కాంబోలో రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా జాన్వీ టాలీవుడ్, బాలీవుడ్‌ల మధ్య ఉన్న తేడా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాలీవుడ్‌లో పని గంటలకు ఎక్కువ ప్రాధాన్య ఉంటుందని అది తనకు చాలా నచ్చినట్లు తెలిపింది. సౌత్ సినిమా షూటింగ్‌లో అందరిలో ఒకరకమైన ఆసక్తి ఉంటుంది. అక్కడ కేవలం ఓ ప్రాజెక్ట్ పూర్తి చేయాలనో డెడ్‌లైన్లలో అందుకోవాలనో మాత్రమే పనిచేయరని అన్నారు. సినిమాలోని ప్రతీ సీన్ అద్భుతంగా రావాలనే ప్రయత్నిస్తారని.. దానికోసం ఎంత సమయాన్ని అయినా కేటాయిస్తారని ప్రశంసించారు. హిందీ సినిమా విషయానికొస్తే.. అక్కడ బడ్జెట్, టైమ్‌లైన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని.. అంతా రూల్ ప్రకారం జరుగుతుందని తెలిపింది.

కొన్నిసార్లు అతిజాగ్రత్తల వల్ల క్రియేటివిటీ విషయంలో రాజీపడాల్సి వస్తుందని.. అలాగే పక్కా ప్రణాళికల వల్ల ప్రయోజనాలు కూడా ఉన్నాయని అన్నారు. ఇక తెలుగులో సినిమా సెట్స్‌లో బ్రేక్ టైమింగ్స్ కూడా చాలా ఖచ్చితంగా పాటిస్తారని జాన్వీ పేర్కొన్నారు. అక్కడ లంచ్ బ్రేక్ ఇస్తే, ప్రతి ఒక్కరూ కంగారు పడకుండా సుమారు 40 నిమిషాల పాటు ప్రశాంతంగా భోజనం చేయడానికి సమయం దొరుకుతుందని.. ఆ తర్వాత పని ప్రారంభించే ముందు కనీసం ఒక 20 నిమిషాల పాటు చిన్నపాటి నిద్ర తీసేందుకు కూడా వీలుంటుందని చెప్పారు. అయితే, ఇలాంటి సౌకర్యాలు కొన్నిసార్లు తమ బాలీవుడ్ ఇండస్ట్రీలో లోపిస్తాయని, అక్కడ ఈ విషయాల్లో కాస్త రాజీ పడాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, తాను తెలుగులో చేసిన ప్రాజెక్ట్‌ల సమయంలో ఎప్పుడూ లాంగ్ షిఫ్ట్‌లు చేయాల్సిన అవసరం రాలేదని జాన్వీ గుర్తుచేసుకున్నారు. కేవలం ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే 12 గంటల పాటు షూటింగ్‌లో పాల్గొన్నానని.. మిగతా అన్ని రోజుల్లో కేవలం 9 నుండి 10 గంటల లోపే తన పని ముగించుకుని ప్యాకప్ చెప్పేవాళ్లని తెలిపారు.



## ప్రభాస్ స్పిరిట్‌లో ఆ స్టార్ నటి.. మరోసారి హిట్ కాంబో రిపీట్..





పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'స్పిరిట్' ఒకటి. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌ను టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై భూషన్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా.. క్రిష్ ఫేమ్ వివేక్ ఒబెరాయ్ పవర్ ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. తాజాగా ఓ సూపర్ అప్డేట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. స్పిరిట్‌లో నటి నదియా ఓ కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు టాక్. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగా.. ఆమె షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టినట్లు తెలుస్తుంది. ఈ మేరకు నటీనటులకు ఏర్పాటు చేసిన క్యారివ్యాన్‌కు సంబంధించిన దాంట్లో నటి నదియా పేరు మీద క్యారివ్యాన్ రిజర్వ్ చేసి ఉంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించి వీడియో వైరల్ అవుతుండగా.. స్పిరిట్ చిత్రంతో మరోసారి ప్రభాస్‌తో నదియా స్క్రీన్ చేసుకోబోతుందని తెలిసి ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. కాగా.. ప్రభాస్, నదియా కాంబోలో ఇప్పటికే 'మిర్చి' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో ప్రభాస్ తల్లి పాత్రలో నదియా నటించగా.. తల్లీకొడుకులుగా ప్రభాస్, నదియా కాంబోకు ఫుల్ క్రేజ్ ఏర్పడింది. ఇప్పుడు వీరిద్దరు స్పిరిట్ కోసం కలిసి వర్క్ చేస్తుండగా.. ఈసారి నదియా ప్రభాస్ పక్కన ఎలాంటి పాత్ర పోషిస్తుందని అభిమానుల్లో క్యూరియాసిటీ పెరిగింది.



## రణ్‌వీర్‌పై బ్యాన్.. కోర్టును ఆశ్రయించిన నిర్మాత


బాంబే సివిల్ కోర్టులో ప్రముఖ నిర్మాత టీపీ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్ బాలీవుడ్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్‌పై (Ranveer Singh) 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' విధించిన నాన్ కోఆపరేషన్ ఆదేశాలకు వ్యతిరేకంగా ఆయన ఈ న్యాయపోరాటానికి దిగారు. చలనచిత్ర పరిశ్రమకు చెందిన ఏ సభ్యుడి మీద నిషేధం విధించి ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఏ సంస్థకూ లేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

దీనిపై టీపీ అగర్వాల్ మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమలో ఎవరి పైనా నిషేధాలు, ఆదేశాలు జారీ చేసే హక్కు ఎవరికీ లేదు. ఎఫ్‌డబ్ల్యూఐసీఈ (FWICE) లాంటి సంస్థలకు ఇలా చేసే హక్కు అస్సలు లేదు. గతంలో నేను, దర్శకుడు విపుల్‌షా కలిసి ఇలాంటి ధోరణులకు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేశాం. సినిమా రంగం అనేది పరస్పర సహకారంతో నడిచే ఓ సృజనాత్మక వేదిక. ఇలాంటి సున్నితమైన విషయాలను చట్టపరమైన, వృత్తిపరమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలి. ఒక వ్యక్తితో ఎవరూ పనిచేయకూడదంటూ బలవంతం చేయడం, నిరుత్సాహపర్చడం లాంటి చర్యలను తేలికగా తీసుకోకూడదు. ఇలాంటి నిర్ణయాల వల్ల ఎంతోమంది జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా, సృజనాత్మక స్వేచ్ఛకు విఘాతం కలుగుతుంది. అందుకే ఈ వ్యవహారాలను పారదర్శకంగా, చట్టబద్ధంగా పరిష్కరించాలి" అని అన్నారు.



టాలీవుడ్ హీరోయిన్లు సినిమా అవకాశాలు రాకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా డబ్బులు సంపాదించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్తగా వచ్చిన సబ్‌స్క్రిప్షన్ అనే ఆప్షన్‌ను వాడుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఈ పద్ధతిలో హీరోయిన్ల పర్సనల్ ఫోటోలు, వీడియోలు చూడాలంటే అభిమానులు ప్రతి నెల కొంత డబ్బులు కట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా నెలకు ఒక్కో ఫాలోవర్ నుండి రూ. 299 వసూలు చేస్తోంది. అలాగే రామ్ చరణ్ 'చిరుత' సినిమా హీరోయిన్ నేహా శర్మ కూడా ఇదే బాటలో నడుస్తూ డబ్బు సంపాదిస్తోంది. తాజాగా, మన తెలుగు బ్యూటీ ఈషా రెబ్బా కూడా ఇదే ట్రెండ్‌ను ఫాలో అవుతుండటం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈషా రెబ్బా మిగతా హీరోయిన్ల కంటే ఒక అడుగు ముందుకు వేసి, తన ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ కోసం నెలకు ఏకంగా రూ. 390 ఛార్జ్ చేస్తోంది. గత ఏడాది 'ఓంశాంతి శాంతి శాంతి' అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఈ అమ్మడికి, ప్రస్తుతం టాలీవుడ్‌లో పెద్దగా అవకాశాలు లేవు. అందుకే ఈమె ఈ సబ్‌స్క్రిప్షన్ దారి పట్టినట్లు తెలుస్తోంది. ఫాలోవర్స్ సంఖ్యను బట్టి చూస్తే ఈమెకు నెలకు కూర్చున్న చోటే భారీగా ఆదాయం వచ్చేలా ఉంది. కానీ, ఈషా రెబ్బా తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. కేవలం డబ్బుల కోసమే హీరోయిన్లు ఇలాంటి పద్ధతులు వాడుతూ దిగజారిపోవాలా? అంటూ నెట్టింట ఘాటుగా కామెంట్స్ చేస్తూ ఫైర్ అవుతున్నారు.

## అవకాశాలు లేకున్నా చేతినిండా సంపాదిస్తున్న ఈషా రెబ్బా..



## 'పెద్ది' సినిమాకి అసలు ట్రైలరే అక్కర్లేదు.. కంటెంట్ ఉన్నోడికి కట్ అవుట్ చాలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ - దర్శకుడు బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో చిత్ర యూనిట్ వరుస ప్రమోషన్లతో హోరెత్తిస్తోంది. అయితే ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ గురించి సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తున్న వేళ, డైరెక్టర్ బుచ్చిబాబు చేసిన సంచలన కామెంట్స్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. అసలు పెద్ది సినిమాకు ట్రైలర్ అవసరం లేదంటూ ఆయన చేసిన బోల్డ్ కామెంట్స్ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి.

**ట్రైలర్లు చూసే సినిమాలకు వెళ్తున్నామా ఏంటి..**

సినిమా రిలీజ్ దగ్గరపడుతున్నా ఇప్పటివరకు అధికారిక ట్రైలర్ రాకపోవడంపై ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు బుచ్చిబాబు తనదైన శైలిలో స్పందించారు. "ఇంత బజ్ ఉన్న 'పెద్ది' సినిమాకి రిలీజ్ ట్రైలర్ అక్కర్లేదు.. అసలు ఈ సినిమాకి ట్రైలర్ కూడా అక్కర్లేదు. ఒకప్పుడు మనం అన్ని సినిమాలకీ ట్రైలర్లు చూసే థియేటర్లకు వెళ్లేవాళ్లమా ఏంటి? కథపై, కంటెంట్‌పై మాకు అంత నమ్మకం ఉంది" అని బుచ్చిబాబు కుండబద్దలు కొట్టారు. సినిమాపై ఉన్న విపరీతమైన హైప్ దృష్ట్యా కేవలం ప్రమోషనల్ కంటెంట్, సాంగ్స్ చాలని ఆయన అభిప్రాయపడ్డారు.

సినిమా పోస్ట్ ప్రొడక్షన్, ప్రమోషన్లపైనే పూర్తి దృష్టి పెట్టడం కోసం బుచ్చిబాబు డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉంటున్నట్లు వెల్లడించారు. "నేను ప్రస్తుతం సోషల్ మీడియాలో లేను. నా ఫోన్ లో ఉన్న అన్ని సోషల్ మీడియా యాప్స్ డిలీట్ చేసేసాను" అని బుచ్చిబాబు షాకింగ్ నిజం చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు, ట్రోల్స్ లేదా అనవసరమైన చర్చలకు దూరంగా ఉంటూ, కేవలం థియేటర్లలో ప్రేక్షకులకు బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ట్రైలర్ లేకుండానే సినిమాను థియేటర్లలోకి తెస్తున్నారంటే 'పెద్ది' అవుట్‌పుట్ ఏ రేంజ్‌లో వచ్చిందో అర్థం చేసుకోవచ్చని మెగా ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. మరి ట్రైలర్ లేకుండానే జూన్ 4న బాక్సాఫీస్ బరిలోకి దిగుతున్న మెగా పవర్ స్టార్ 'పెద్ది' ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## నాని కొత్త సినిమా ప్రచారం.. నిజమే లేదట!

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని కేవలం నటుడిగానే కాకుండా.. తన సొంత నిర్మాణ సంస్థ 'వాల్ పోస్టర్ సినిమా' బ్యానర్‌పై వైవిధ్యమైన సినిమాలను నిర్మిస్తూ నిర్మాతగానూ టాలీవుడ్‌లో సరికొత్త మైలురాళ్లను అందుకుంటున్నారు. ఇటీవలే ఈ బ్యానర్ నుండి వచ్చిన 'కోర్టు' సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ సాధించడంతో, నాని తన ప్రొడక్షన్ హౌస్‌లో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులను లైన్‌లో పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో విపరీతంగా బజ్ నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే, నాని లైనప్ మరియు వాల్ పోస్టర్ సినిమా రాబోయే చిత్రాల గురించి నెట్టింట ప్రచారంలో ఉన్న వార్తలపై నిర్మాణ సంస్థ స్పందిస్తూ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది.

ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతున్న సమాచారం ప్రకారం.. నాని ప్రస్తుతం నటుడిగా 'ది ప్యారడైజ్' షూటింగ్‌తో ఫుల్ బిజీగా ఉన్నారని, ఈ చిత్రం ఆగస్టు విడుదలకు సిద్ధమవుతోందని ప్రచారం జరుగుతోంది. దీని తర్వాత రన్ రాజా రన్, సాహో ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' సినిమాను ఈ ఏడాది చివర్లో ప్రారంభించనున్నట్లు టాక్. ఇక నిర్మాతగా వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై మూడు ప్రాజెక్టులు చర్చల్లో ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో వార్తలు వస్తున్నాయి. 'బ్యాండ్ మేళం' (హర్ష్ రోషన్, శ్రీదేవి ప్రధాన పాత్రలు) చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన సతీష్ జవ్వాజి చెప్పిన ఒక సరికొత్త ఐడియా నానికి నచ్చిందని, రీసెంట్‌గా ఫైనల్ స్క్రిప్ట్ లాక్ చేసి లీడ్ యాక్టర్ల కోసం అన్వేషణ మొదలుపెట్టారని ప్రచారం సాగుతోంది.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.